
అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....


# వన్ నేషన్


RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 310 ఎడిటర్: కె.యువరాజ్ గురువారం 20-8-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు




## మరో 25 ఏళ్లు.. 543 సీట్లే

**- లోక్‌సభ సీట్లను స్తంభింపజేయాలి - అయోధ్య విరాళాల చోరీపై దేశవ్యాప్త ఉద్యమం - అక్టోబరు 31లోగా గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (వన్‌నేషన్):** వచ్చే 25 ఏళ్లపాటు లోక్‌సభ సీట్ల సంఖ్యను ఇప్పుడున్న 543కే స్తంభింపజేయాలని కేంద్రప్రభుత్వాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) డిమాండ్ చేసింది. ఈ సీట్లలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి, 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే అమలు చేయాలని పేర్కొంది. జనగణనలో భాగంగా కులగణన జరుపుతామన్న హామీని కచ్చితంగా అమలుపరచాలని, తెలంగాణ, బిహార్‌లలో జరిగినట్టుగా కులగణన జరపాలని సూచించింది. 1937లో సీడబ్ల్యూసీ తీర్మానించిన విధంగా వందేమాతర గేయంలోని మొదటి రెండు చర ణాలే ఆలపించాలని నిర్ణయించింది. విద్యార్థుల సమస్యలపై దేశవ్యాప్తంగా 800 నగరాల్లో భారీ సభలను నిర్వహించాలని, అయోధ్య రామాలయంలో జరిగిన విరాళాల చోరీపై ఉద్యమించాలని తీర్మానించింది. బుధవారం ఢిల్లీలోని ఇందిరాభవన్‌లో నాలుగు గంటలకుపైగా జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో సహా మొత్తం 88 మంది నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీరిలో కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, కేరళ, హిమాచల్ ప్రదేశ్ సీఎంలు రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్, సతీశన్, సుఖ్వీందర్‌సింగ్ కూడా ఉన్నారు.



## త్యాగం మీది.. అండ మాది!

**-వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం - - చెక్కు అందించిన సీఎం చంద్రబాబు- ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం - మిగిలినది త్వరలోనే ఇస్తామన్న సీఎం - కూటమి ప్రభుత్వ మేలును మర్చిపోలేం: నిర్వాసితులు**

**అమరావతి, ఆగస్టు 19 (వన్‌నేషన్):** వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఈ ఏడాది జూన్ 27న రూ. 318 కోట్లు పరిహారం అందించిన ప్రభుత్వం, బుధవారం మరో రూ. 200 కోట్ల పరిహారాన్ని అందించింది. అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం చంద్రబాబు నిర్వాసిత కుటుంబాలకు ఆ చెక్కును అందజేశారు. దీంతో ఇప్పటి వరకు వెలిగొండ నిర్వాసితులకు ప్రభుత్వం రూ. 518 కోట్లు పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని, వారికి అండగా నిలుస్తోందని చెప్పారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని పేర్కొన్నారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులతో పాటు మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడు, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ప్రకాశం జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి

**- వారికి సకాలంలో రుణం అందించాలి - రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి**



**హైదరాబాద్, ఆగస్టు 19 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్రాన్ని 2034 నాటికి ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో బ్యాంకింగ్, ఆర్థిక రంగం కీలక భాగస్వాములుగా మారాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. ప్రభుత్వ వ్యయంతోనే ఈ లక్ష్య సాధన సాధ్యం కాదని, భారీ స్థాయిలో ప్రైవేట్ పెట్టుబడులు, బలమైన ఆర్థిక సంస్థలు, లోతైన ఆర్థిక మార్కెట్లు, వినూత్న విధానాలు అవసరమని పేర్కొన్నారు. 50వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎసఎల్‌బీసీ) సమావేశం బుధవారం ప్రజాభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు భవిష్యత్తు వ్యూహాన్ని రూపొందించాలన్నారు. రైతురుణం కోసం బ్యాంకును వెతుక్కుంటూ రావడం కాదు... బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలని సకాలంలో వారికి రుణాలు అందించాలని సూచించారు. డెయిరీ, మత్స్య, ఉద్యాన, పామాయిల్, ఫుడ్ ప్రాసెసింగ్ సహా ఇతర అనుబంధ రంగాలను అధికారిక రుణ వ్యవస్థలోకి తీసుకురావాలని అన్నారు. రైతుకు రుణం ఇవ్వడమే కాకుండా, ఆ సొమ్మును అధిక, స్థిరమైన వ్యవసాయ ఆదాయంగా మార్చడమే లక్ష్యంగా ఉండాలని సూచించారు. రుణాలను

4లో

## సాస్కి నిధులతో 37 డిగ్రీ కాలేజీలు

**- రాష్ట్రంలో మూడుచోట్ల లైబ్రరీలు: మంత్రి లోకేశ్**



**అమరావతి, ఆగస్టు 19 (వన్‌నేషన్):** రాష్ట్రంలో 37 డిగ్రీ కాలేజీలకు సొంత భవనాలు కల్పించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. ఒక్కో డిగ్రీ కాలేజీ నిర్మాణంతో పాటు అన్ని హంగులు కల్పించడానికి రూ.15 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. సాస్కి స్కీమ్ ద్వారా కాలేజీల నిర్మాణం పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేస్తామని, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో జోనల్ స్థాయిలో లైబ్రరీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అమరావతిలో అద్భుతమైన లైబ్రరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, విశాఖ, రాయలసీమలో కూడా గ్రంథాలయాలు నిర్మిస్తామని లోకేశ్ పేర్కొన్నారు.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా పనిచేసే విలేకరులు కావలెను.

9948222240

# ప్రమాదపుటంచుల్లో పాదచారులు

## - ఆక్రమణలతో కనుమరుగవుతున్న నడకదారులు -

## ఫుట్‌పాత్‌ల పరిరక్షణకు ప్రత్యేక వ్యవస్థ అవసరం.....

హైదరాబాద్ మహానగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. జనాభా పెరుగుతోంది. వాహనాల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. రహదారులు వెడల్పవుతున్నాయి.. కొత్త మౌలిక వసతులు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ నగరంలో అత్యంత ప్రాథమికమైన పాదచారుల నడకదారుల పరిస్థితి మాత్రం రోజురోజుకూ అధ్వానంగా మారుతోంది. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలతో కనుమరుగవుతుండటంతో నగరవాసులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోడ్లపైనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంతకు నగరంలో ఫుట్‌పాత్ ఉందా.. లేదా? అన్న ధోరణిలో పాదచారులు ఉన్నారు. ఒకప్పుడు పాదచారులకు రక్షణగా కనిపించిన ఫుట్‌పాత్‌లు ఇప్పుడు అనేక ప్రాంతాల్లో గుర్తుపట్టలేని స్థితికి చేరాయి. దుకాణాల ముందు ఉన్న నడకదారులపై వ్యాపార సామగ్రి, బల్లలు, స్టాండ్లు, సరుకులు పెట్టడం సాధారణమైపోయింది. సందు దొరికితే చాలు.. తమ వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు ఫుట్‌పాత్‌లను ఉపయోగించుకుంటున్నారు.

వీధి వ్యాపారులు సైతం పాదచారుల కోసం కేటాయించిన స్థలాల్లోనే వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో నడిచేందుకు దారి లేకుండా పోతోంది. ప్రధాన రహదారులకే పరిమితమైన సమస్యగా భావించినా.. బస్తీలు, కాలనీలు, మార్కెట్లు, రద్దీ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

మెట్రో స్టేషన్ల కింద కూడా ఆక్రమణలే కనిపిస్తున్నాయి.శనగర రవాణా వ్యవస్థలో కీలకంగా మారిన మెట్రో స్టేషన్ల పరిసరాల్లోనూ పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మెట్రో మార్గాల కింద ఏర్పాటు చేసిన నడకదారులపై చిన్నచిన్న వ్యాపారాలు, దుకాణాల సామగ్రి, ఇతర ఆక్రమణలు దర్శనమిస్తున్నాయి. దీంతో మెట్రో ప్రయాణికులు సైతం రోడ్డు మీదికి వచ్చి నడవాల్సిన దుస్థితి కలుగుతుంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు ఫుట్‌పాత్‌లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల మధ్య నుంచి దారి చేసుకుంటూ వెళ్లాల్సి రావడం ప్రమాదకరంగా మారుతోంది.

### రోడ్డుపైనే నడక.. ప్రాణాలపైకి ముప్పు....

ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురైతే దాని ప్రభావం కేవలం నడకలో అసౌకర్యంతో ముగియదు. అది నేరుగా పాదచారుల ప్రాణాలపై ప్రభావం చూపుతోంది. నడకదారి లేకపోవడంతో పాదచారులు తప్పనిసరి పరిస్థితుల్లో రహదారిపైనే నడవాల్సి వస్తోంది. అదే సమయంలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు కార్లు, బస్సులు, భారీ వాహనాలు వేగంగా దూసుకెళ్తుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉంటుంది. చిన్నపాటి ఢీకొనుల్ల నుంచి తీవ్ర ప్రమాదాల వరకు చోటుచేసుకుంటున్నాయి. కొందరు తీవ్రంగా గాయపడుతుండగా.. మరికొందరు ప్రాణాలు కోల్పోతున్న విషాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

### నిర్మాణానికి కోట్ల ఖర్చు.. ఉపయోగం మాత్రం శూన్యం

పాదచారుల సౌకర్యం కోసం ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు భారీగా నిధులు వెచ్చించి ఫుట్‌పాత్‌లను నిర్మిస్తున్నాయి. అయితే నిర్మాణం పూర్తయిన తర్వాత వాటి నిర్వహణ, పరిరక్షణపై తగినంత శ్రద్ధ లేకపోవడం సమస్యగా మారుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు పాడైపోయి కనిపించకుండా పోతుంటే.. మరికొన్ని చోట్ల ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమణదారులు తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఫలితంగా ప్రజాధనం ఖర్చు చేసినా.. దాని ప్రయోజనం పాదచారులకు దక్కడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### అధికారుల పర్యవేక్షణ ఏదీ?

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు ఒక్కరోజులో ఏర్పడినవి కావు. నెలల తరబడి, సంవత్సరాల తరబడి కొనసాగుతున్నా సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పుడప్పుడు ఆక్రమణలు తొలగించినా.. కొద్ది రోజులకే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని నగరవాసులు అంటున్నారు. ఆక్రమణలను తొలగించడం మాత్రమే కాకుండా.. తిరిగి ఆక్రమణలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ అవసరమని ప్రజలు కోరుతున్నారు.

### ఫుట్‌పాత్‌లకు ప్రత్యేక రక్షణ వ్యవస్థ అవసరం...

నగరం విస్తరిస్తున్న వేగానికి అనుగుణంగా పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఫుట్‌పాత్‌లను గుర్తించి, వాటి ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర సర్వే నిర్వహించడంతోపాటు ఆక్రమణలను శాశ్వతంగా అరికట్టే కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఫుట్‌పాత్‌ల పరిరక్షణ కోసం ప్రత్యేక పర్యవేక్షణ విభాగాన్ని ఏర్పాటు చేయడం, ఆక్రమణలపై నిరంతరం తనిఖీలు నిర్వహించడం, ఉల్లంఘనలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది.

### పాదచారులకూ నగరంపై హక్కుంది...

నగరాభివృద్ధి అంటే కేవలం ఎత్తైన భవనాలు, వెడల్పైన రహదారులు, ఫ్లైఓవర్లు, మెట్రో మార్గాలు నిర్మించడం మాత్రమే కాదు. పాదచారులు సురక్షితంగా నడిచే మార్గాలను కల్పించడం కూడా సమగ్ర నగరాభివృద్ధిలో కీలక భాగమే. ఫుట్‌పాత్‌లు వాహనాల పార్కింగ్ కోసం కాదు.. దుకాణాల విస్తరణ కోసం కాదు.. పాదచారుల కోసం నిర్మించినవన్న విషయాన్ని అధికారులు, వ్యాపారులు గుర్తించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి విముక్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగరవాసులు ఆశిస్తున్న విషయాన్ని ప్రభుత్వంతో పాటు ప్రభుత్వాధికారులు మరిచిపోకూడదు.

ఫుట్‌పాత్ కనిపించని నగరం.. పాదచారులకు సురక్షితం కాని నగరమే. రహదారిపై ప్రతి అడుగు ప్రమాదంగా మారకముందే అధికారులు మేల్కొని నడకదారులను కాపాడాల్సిన సమయం ఆసన్నమైంది. ఫుట్ పాత్ లు కేవలం పాదచారుల కోసమే అన్న విషయాన్ని ప్రభుత్వంతో పాటు అక్కడి దుకాణ సముదాయాల యజమానులు బాధ్యతాయుతంగా భావించాల్సిన అవసరం ఉంది.

–సయ్యదా ఆలియా ఇస్మత్
సీనియర్ జర్నలిస్ట్ సెల్: 8639754985

# ఫోటోజర్నలిస్టులు వార్తా పత్రికలకు 'ప్రాణం'

**- రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి - త్వరలో జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులు - రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి.ముకుంద రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 19 (వన్‌నేషన్):** వార్తా పత్రికలకు ఫోటోజర్నలిస్టులు ప్రాణం వంటివారని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఒక ఫోటో వెయ్యి మాటలతో సమానమని, సమాజంలో జరిగే ప్రతి ముఖ్య ఘటనను భవిష్యత్ తరాలకు అందించే శక్తి ఫోటోజర్నలిస్టులకు ఉందని కొనియాడారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం 187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'బెస్ట్ న్యూస్ ఫోటో కాంపిటీషన్ 2026'తో పాటు ఫోటో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి.ముకుంద రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దాదాపు రెండున్నర దశాబ్దాలుగా తెలంగాణ స్టేట్ ఫోటోజర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్స వాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. "ఫోటోగ్రాఫర్ కేవలం కెమెరాను క్లిక్ చేసే వ్యక్తి కాదు.. చరిత్రను భద్రపరిచే చరిత్రకారుడు" అని పేర్కొన్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సంఘటన స్థలాలకు చేరుకుని వాస్తవ పరిస్థితులను ప్రజలకు చూపించే ధైర్యం ఫోటోజర్నలిస్టుల సొంతమ న్నారు. ప్రముఖుల పేర్లతో గతంలో ఏర్పాటు చేసిన ఫోటోగ్రఫీ అవార్డులను పునరుద్ధరించడం ద్వారా ఈ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ప్రభుత్వానికి సూచించారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ రంగానికి సంబంధించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు.

### జర్నలిస్టుల ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులపై త్వరలో నిర్ణయం..

ఒక మంచి ఫోటో సమాజాన్ని ఆలోచింపజేయడంతో పాటు అధికారులను స్పందించేలా చేయగలదని రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ జి.ముకుందరెడ్డి అన్నారు. బాధితుల సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లడంలో ఫోటోగ్రఫీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. "కాలం గడిచిపోతుంది.. మనుషులు మారిపోతారు.. కానీ ఒక గొప్ప ఫోటో మాత్రం ఆ క్షణాన్ని శాశ్వతంగా నిలబెడుతుంది" అని పేర్కొన్నారు.

ఫోటోగ్రాఫర్ సమాజానికి నిశ్శబ్ద సాక్షి, చరిత్రకు శాశ్వత సాక్ష్యమని అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల పట్టాలు, హెల్త్ కార్డులు, అవార్డుల అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. ఇళ్ల పట్టాలకు సంబంధించి రిజిస్ట్రేషన్, హౌసింగ్ సొసైటీల అంశాలను మీడియా అకాడమీ ద్వారా పరిశీలించి ఇప్పటికే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. జర్నలిస్టులందరికీ ఈ నెలలోనే హెల్త్ కార్డులు వచ్చే అవకాశం ఉందని ముకుందరెడ్డి తెలిపారు. హెల్త్ కార్డుల కోసం సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులకు కార్డులు అందించిన అనంతరం జర్నలిస్టులకు కూడా ఒకేసారి అందించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో టి.ఎస్.పి.జె.ఏ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, ఉపాధ్యక్షులు పి.రామ్మూర్తి, టి.కిషోర్ సింగ్, కోశాధికారి కె.అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.సర్వర్, జి.వసంత్ కుమార్, ఎన్.శివకుమార్, మహ్మద్ అలీమోద్దీన్, ఎ.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మన ఆలోచన సాధన సమితి (మాస్) ఆధ్వర్యంలో నేడు బడుగుల బంధువు "టైగర్" ఆలె నరేంద్ర జయంతి

**హైదరాబాద్, ఆగస్టు 19 (వన్‌నేషన్):** సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు గంటలకు ప్రారంభం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ నేతలు అందరూ హాజరు. "టైగర్" నరేంద్ర --- ఒక ముగింపు కాదు, ఒక స్ఫూర్తి. పోరాటం చేసిన ప్రతి అడుగు వెంటనే ఫలితం ఇవ్వకపోవచ్చు. కానీ నిజాయితీగా వేసిన అడుగు చరిత్రలో ఎప్పటికీ వృథా కాదు." ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు తెలియాలి. ఆధిపత్య రాజకీయాల మాటున దాచి ఉంచిన ఒక పోరాట చరిత్ర. ఆ చరిత్రలో ఆలె నరేంద్ర అధ్యాయం కూడా ఒక ప్రధాన భూమిక. ఆధిపత్య కథనాల మాటున కనుమరుగైన చరిత్ర. చరిత్రలో ఒక ఉద్యమం విజయవంతమైన తరువాత, ఆ విజయానికి ప్రధాన కథనం కొద్దిమంది నాయకుల చుట్టూ కేంద్రీకృతమవుతుంది. హైదరాబాద్ నడిబొడ్డున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు రాజకీయ పార్టీలకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బీసీ సంఘాల నాయకులు హాజరవుతున్నారు. ఉద్యమం ప్రారంభ దశల్లో కీలక పాత్ర పోషించిన అనేక మంది నాయకుల పాత్రలు వెనుకబడిపోతాయి. ఆ కోణంలో చూస్తే ఆలె నరేంద్ర రాజకీయ జీవితం ఆధిపత్య రాజకీయ కథనాల మాటున కనుమరుగైన ఒక ముఖ్యమైన చరిత్రగా వర్ణించవచ్చు. ప్రజలు ప్రేమగా"టైగర్ నరేంద్ర" అని పిలుచుకున్న ఆయనను కేవలం ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా భవిష్యత్తు తరాలకు "టైగర్" నరేంద్ర ఇచ్చే స్ఫూర్తిగా చూడాలి. తన పుట్టిన నేల ఆకాంక్షల కొరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీజేపీ అంటే నరేంద్ర, నరేంద్ర అంటే బీజేపీ అనే విధంగా ఎదిగి తానే కర్త, కర్మ, క్రియ లా ఉన్న పార్టీ తెలంగాణ పట్ల అనుసరిస్తున్న రాజకీయ వైఖరిని విభేదించి ఆయన బీజేపీ ని విడిచి తెలంగాణ కోసం ఆయన తీసుకున్న సాహసోపేతమైన



నిర్ణయమే ఆయన రాజకీయ జీవితానికి అసలు ప్రత్యేకతను తెచ్చింది.దాని కోసమే తెలంగాణ సాధన సమితి ఆవిర్భావం. తెలంగాణ ఉద్యమాన్ని ఐక్యంగా నిర్మించడం కోసం టీఆర్ఎస్ లో తన పార్టీని విలీనం చేసి ఉద్యమాన్ని ఇంకా ఉధృతం చేసిన ఘనత వారిది. మనిషి జీవితం ఎంతకాలం సాగిందన్నది అంత ముఖ్యమైనది కాదు; అతను నమ్మిన లక్ష్యం కోసం ఎంత ధైర్యంగా జీవించాడన్నదే ముఖ్యం. ఇన్ని మలుపుల మధ్య ఆయన పేరు ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించింది: "టైగర్ నరేంద్ర." ఆ పేరు వెనుక ఉన్న అసలు అర్థం గర్జన కాదు. భయపడకుండా ముందుకు సాగడం. పదవి పోతుందేమోనని భయపడకుండా నిర్ణయం తీసుకోవడం. విమర్శలు వస్తాయేమోనని వెనక్కి తగ్గకుండా తన అభిప్రాయాన్ని చెప్పడం. రాజకీయ పరిస్థితులు మారినా ప్రజా జీవితాన్ని కొనసాగించడం. అదే ఆయన జీవితంలో నుంచి భవిష్యత్తు తరాలు నేర్చుకోవాల్సిన గొప్ప పాఠం. ఆలె నరేంద్ర లాంటి నాయకులను ఆదర్శంగా తీసుకొని భావితరాలకు మార్గదర్శకంగా ఉండాలని మేధావులు కోరుతున్నారు.

# సేవతోనే పుట్టినరోజు...

## సతీష్ అరోరా 'చిన్నన్న'కి చిరునవ్వుల ప్రతిధ్వని

**కూకట్‌పల్లి ప్రతినిధి ఆగస్టు 19 (వన్ నేషన్):** కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఘనంగా జరిగిన సతీష్ ఆరోరా జన్మదిన వేడుకలు కేవలం ఒక కార్యక్రమం మాత్రమే కాదు... ప్రేమ, సేవ, పార్టీకి అంకితభావంతో నిండిన హృదయ స్పందనగా మారాయి. బిఆర్ఎస్ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా జన్మదిన శుభసందర్భంగా బాలాజీ నగర్ డివిజన్‌లో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ పగడాల శిరీష బాబురావు, డివిజన్ సెక్రెటరీ వెంకటేష్ చౌదరి, మరియు సీనియర్ నాయకుడు పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక శివానంద రిహాబిలిటేషన్ సెంటర్, రాందేవ్ హాస్పిటల్‌లో ఉన్న పేషెంట్లకు పండ్లు, బ్రెడ్స్ పంచిపెట్టారు. ఆకలితో ఉన్న వారికి ఓ చిన్న అందం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఓ పెద్ద ఆశ---అదే ఈ వేడుకల అసలైన సారం.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సతీష్ అరోరా ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం, కార్యకర్తల కోసం అహర్నిశలు కష్టపడుతున్న తీరును గుర్తుచేశారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అడుగుజాడల్లో నడుస్తూ, తనదైన వ్యూహాలతో పార్టీని విజయపథంలో నడిపిస్తూ, కార్యకర్తల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోయే "చిన్నన్న"గా ప్రజలకు చేరువవుతున్న విధానం ఎంతో



ఆనందాన్ని కలిగించిందని వారు అన్నారు.

అంతటి సేవాభావంతో జరుపుకున్న ఈ జన్మదినం చూసిన వారందరిలోనూ ఒకే భావం వ్యక్తమైంది--- పుట్టిన రోజు కేవలం కేక్‌కోసం కాదు... మనిషి బతుకును మంచి పనులతో అర్థవంతం చేసుకోవడానికే. ఈ కార్యక్రమంలో రాందేవ్ హాస్పటల్ సీఈఓ యోబు, కల్పనా, నాయినేని చిన్న తులసి రావు, సీనియర్ నాయకులు కంచనపల్లి నాగరాజు, వట్టి ఉపేందర్ రెడ్డి, పులి మురళి తదితర సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు. ఈ జన్మదినం సందర్భంగా రెడ్డి సతీష్ అరోరాకి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు, ఆయన సేవా తపన మరింత మందిలో మంచి ఆశలు నింపాలని అందరూ కోరుకున్నారు.

# నమస్తే ఎమ్మిగనూరు ప్రజా సమస్యలపై పోరుబాట

**ఎమ్మిగనూరు ఆగస్టు 19 ఎం యూసుఫ్ (వన్ నేషన్):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డి గారు చేపట్టిన "నమస్తే ఎమ్మిగనూరు -- ప్రజా సమస్యలపై పోరుబాట" కార్యక్రమంలో భాగంగా 12వ రోజు ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం గ్రామం 28వ వార్డులో కొనసాగింది.

ఈ సందర్భంగా వెంకటాపురం మాజీ కౌన్సిలర్ బజారి గారు, వారి తనయుడు రాజు గారు రాజీవ్ రెడ్డి గారికి ఘన స్వాగతం పలికి, శాలువాలు, పూలమాలలతో సత్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం రాజీవ్ రెడ్డి గారు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వార్డు నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన "సూపర్ సిక్స్" హామీల అమలు పరిస్థితిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

### మహిళలకు ఇచ్చిన హామీలు ఎక్కడ?

మహిళలకు నెలకు రూ.1,500 ఆర్థిక సాయం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సాయం, మహిళల ప్రయాణ సౌకర్యం వంటి హామీలను కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో విస్తృతంగా ప్రచారం చేసిందని, అయితే వాటిలో అనేక హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని మహిళలు రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు.

### నిరుద్యోగులు, విద్యార్థుల పరిస్థితి ఏమిటి?

నిరుద్యోగ యువతకు ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ, ఉద్యోగాల భర్తీ, యువతకు ఉపాధి అవకాశాలు, నిరుద్యోగ భృతి వంటి హామీలు ఇచ్చారని, విద్యార్థులకు సంబంధించిన తల్లికి వందనం, విద్యా అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అంశాలపై కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితికి పొంతన లేదని యువత, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు,



ఇతర సామాజిక భద్రతా పింఛన్ లబ్ధిదారులు తమకు ఎదురవుతున్న సమస్యలను రాజీవ్ రెడ్డి గారి దృష్టికి తీసుకువచ్చారు. పెన్షన్ల విషయంలో గతంలో ఉన్న భరోసా, సకాలంలో అందే సంక్షేమ పథకాలపై ప్రజల్లో ఉన్న నమ్మకం ఇప్పుడు తగ్గిపోయిందని పలువురు పెన్షనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. "జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే చేరేవి. వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినా, వాటి అమలులో మాత్రం నిరాశే మిగిలింది" అని వార్డు ప్రజలు రాజీవ్ రెడ్డి గారితో తమ బాధను పంచుకున్నారు. వార్డులో అనేక ప్రాంతాల్లో సరైన రోడ్లు లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, పారిశుధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని ప్రజలు తెలిపారు. వర్షాలు వచ్చిన సమయంలో ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని, అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రాజీవ్ రెడ్డి గారు మాట్లాడుతూ "ప్రజల సమస్యలను తెలుసుకోవడమే కాదు.. వాటి పరిష్కారం కోసం ప్రజల తరఫున పోరాడటమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యం. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ప్రజలకు గుర్తు చేస్తూ, కూటమి ప్రభుత్వం ఏం చెప్పింది.. ఏం చేసింది.. ఏం చేయలేకపోయిందో ప్రతి గడపకు వెళ్లి వివరిస్తాం. ప్రజల గొంతుకగా నిలబడి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతాం" అని అన్నారు. అనంతరం వార్డు నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన రాజీవ్ రెడ్డి గారు రాబోయే మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను, వాటి అమలు పరిస్థితిని ప్రతి గడపకు తీసుకెళ్లాలని, ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించాలని సూచించారు. అలాగే వార్డులో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, తాగునీరు తదితర స్థానిక సమస్యలను ప్రజలతో కలిసి గుర్తించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



# టైగర్ ఆలే నరేంద్ర 80వ జయంతి వేడుకలకు పెద్ద ఎత్తున తరలిరావాలి

**హైదరాబాద్, ఆగస్టు 19 (వన్‌నేషన్):** హైదరాబాదులోనే బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టైగర్ ఆలే నరేంద్ర గారి 80వ జయంతి కార్యక్రమం మన ఆలోచన సాధన సమితి మాస్ ఆధ్వర్యంలో మధ్యాహ్నము 2:00 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ కార్యక్రమానికి ఉద్యమకారులు, మేధావులు, ఇంటలెక్చుల్స్,కవులు, రచయితలు, ప్రజాప్రతినిధులు, కార్మికులు, కర్షకులు, అభిమానులు, ఆయన మీద ప్రేమ ఉన్నవాళ్లు, పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు గారు పిలుపునిచ్చారు. టైగర్ నరేంద్ర గారు చేసిన సేవలను స్మరించుకుంటూ వారికి ఘనంగా నివాళులర్పిస్తాము. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి మంగిలి పెల్లి శంకర్, మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దపూర బ్రహ్మయ్య శ్రీకాంత్ రవి తదితరులు పాల్గొన్నారు.




# కొత్తపేటలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అతవలె పార్టీ

**హైదరాబాద్, ఆగస్టు 19 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పసుల రవికుమార్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు స్నేహలత ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. జిల్లా కమిటీల నిర్మాణం భవిష్యత్తు కార్యాచరణ పై జిల్లా కమిటీల నిర్మాణంపై ఈ మీటింగ్ లో మాట్లాడడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుంచు లింగయ్య బరిగెల రాములు -రాష్ట్ర అధికార ప్రతినిధి, మహంకాళి శ్రావణ్ కుమార్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు గద్దల వెంకన్న, వంగాల సందీప్, కాసర్ల రాజకుమార్, ఏర్పుల ప్రశాంత్, ఏ సైదులు కొమ్ము రాజు తదితరులు పాల్గొన్నారు.



# జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ కమిషనర్లకు ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కాంక్లేవ్ కు ఆహ్వానం

**హైదరాబాద్, ఆగస్టు 19 (వన్‌నేషన్):** ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈనెల 21,22 తేదీలలో జరిగే జాతీయ సదస్సుకు జి.హెచ్.ఎం.సి కమిషనర్ కర్ణన్, హెచ్.ఎం.డి.ఏ కమిషనర్ సర్ఫరాజ్ అహమ్మద్ ను హైదరాబాద్ ప్రెస్ క్లబ్ పాలకమండలి కలిసింది.బుధవారం నాడు ప్రెస్ క్లబ్స్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ సీ.ఈ.ఓ వివేక్ ముఖర్జీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్. విజయ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు





ఏ. రాజేష్,జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లి బాపురావు, కోశాధికారి రమేష్ వైట్ల జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ ను ఈ సందర్భంగా శాలువతో సత్కరించారు. ప్రెస్ క్లబ్స్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ జాతీయ సదస్సుకు రావాలని ఆహ్వానించారు.

అనంతరం నానక్ రామ్ గూడా లోని హెచ్.ఎం.డి.ఏ కార్యాలయంలో కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ గారిని ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులు ఏ. రాజేష్, జాయింట్ సెక్రెటరీలు చిలుకూరి హరిప్రసాద్, వర్దెల్లి బాపు రావు, ప్రెస్ క్లబ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు ముత్యాల సత్తిబాబు తదితరులు కలిసి ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కాంక్లేవ్ కు ఆహ్వానించారు. హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ గారిని మర్యాదపూర్వకంగా శాలువతో సత్కరించారు. ఇదే సందర్భంగా ఆహ్వాన పత్రాన్ని ప్రెస్ క్లబ్ పాలకమండలి బృందం అందజేసింది. జాతీయస్థాయిలో జరిగే ఈ సదస్సుకు తప్పకుండా హాజరవుతానని సర్ఫరాజ్ వెల్లడించారు. దేశంలోని ప్రెస్ క్లబ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మొట్టమొదటిసారిగా ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ జాతీయ సదస్సు విజయవంతం కావాలని సర్ఫరాజ్ ఆకాంక్షించారు.

# ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ డే సందర్భంగా హైదరాబాద్ ఫోటోగ్రాఫర్లకు సన్మానం

**హైదరాబాద్, ఆగస్టు 19 (వన్‌నేషన్):** ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ డే 2026 సందర్భంగా హైదరాబాద్ నగరానికి చెందిన పలువురు ఫోటోగ్రాఫర్లను హైదరాబాద్ ఇండియన్ రెడ్‌క్రాస్ యూత్ కన్వీనర్, తెలంగాణ బీజేపీ ఎండోమెంట్ సెల్ జాయింట్ కన్వీనర్ మణిదీప్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగంలో వారి అనుభవాలు, సాంకేతికతలో వస్తున్న మార్పులు, ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సవాళ్లపై వారితో ఆత్మీయంగా చర్చించారు. సమాజంలోని ముఖ్యమైన సంఘటనలను, విలువైన జ్ఞాపకాలను చిత్రాల రూపంలో భద్రపరుస్తున్న ఫోటోగ్రాఫర్ల సేవలు అభినందనీయమని మణిదీప్ పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్లకు ప్రపంచ ఫోటోగ్రాఫర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో వారు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.



## కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో

# ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు: ఎర్ర యాకన్న

కూకట్‌పల్లి ప్రతినిధి ఆగస్టు 19 (వన్ నేషన్): శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్‌లో కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. టిడబ్ల్యూజేఎఫ్ కూకట్‌పల్లి అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా ప్రజల





సమస్యలను, సమాజంలోని వాస్తవ పరిస్థితులను తమ కెమెరా కళ్లతో ప్రపంచానికి పరిచయం చేస్తూ జర్నలిజంలో విశేష సేవలందిస్తున్న నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ శ్రవణ్ కుమార్, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎర్ర యాకయ్య మాట్లాడుతూ.. "ఒక చిత్రం కోట్ల మాటలు మాట్లాడుతుంది, వేల ప్రశ్నలను సంధిస్తుంది. లక్షల సమాధానాలకు సమానంగా నిలుస్తుంది" అని అన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఫోటో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలు సమాజానికి విలువైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పుట్టి నగేష్, టిడబ్ల్యూజేఎఫ్ కమిటీ సభ్యులు సుజాత, సభ్యులు అనిల్ కిషోర్, శివ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34% పెంపు చారిత్రాత్మక నిర్ణయం

### ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేసీసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు



అమరావతి, ఆగస్టు 19 (వన్‌నేషన్): ఆంధ్ర రాష్ట్రంలో జనాభాలో సగానికి పైగా ఉన్నటువంటి బీసీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంపు చేయటం చారిత్రాత్మక నిర్ణయం అని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ జేసీసీ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు హర్షం వ్యక్తం చేశారు. గత వైకాపా ప్రభుత్వం 2019లో బీసీ రిజర్వేషన్స్ 24 శాతానికి తగ్గించటం ద్వారా అప్పట్లో 16,800 మంది బీసీలకు అన్యాయం జరిగిందని వాపోయారు 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో నంబరు 76 తీసుకొచ్చి బీసీలను అన్యాయం చేసిందని అన్నారు. 559, 560 జీవోల ద్వారా బీసీ రిజర్వేషన్లను ఏకపక్షంగా 34 శాతం నుండి 24.15 శాతానికి తగ్గించిన ఘనత గత పాలకులది అని పేర్కొన్నారు. బీసీలకు రాజకీయ చైతన్యం తెచ్చిన స్ఫూర్తి దాత ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు నాయుడు 1994లో బీసీలకు 34 % రిజర్వేషన్స్ అమలు చేశారన్నారు. వైకాపా ప్రభుత్వ నిర్ణయాలతో కోల్పోయిన 16800 మంది పదవులు తిరిగి పొందేందుకు బీసీలకు గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 34%, పట్టణ స్థానిక ఎన్నికల్లో 33.33% రిజర్వేషన్స్ కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శాసనసభ్యుల మధ్య శాసనసభలో ప్రకటించడం స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామని తాటికొండ నరసింహారావు తెలిపారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో గుంటూరు జిల్లా నాయీబ్రాహ్మణ జేసీసీ అధ్యక్షులు కొండూరు అంకమ్మరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మార్టూరు వీరరాఘవులు, సౌందర్య శాలల సంక్షేమ విభాగం గుంటూరు అర్బన్ కమిటీ అధ్యక్షులు గంగాధర భాస్కర్ రావు కార్యదర్శి ఎన్ రవీంద్రమణి, ఆర్గనైజర్స్ అద్దంకి రవి, కే బత్తేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి

రామన్నపేట ఆగస్టు 19(వన్ నేషన్): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన బాలరాజు, రామన్నపేట పట్టణానికి చెందిన చెరుకు సత్యనారాయణ గతంలో ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేశారు. 2006 నుంచి 2019 వరకు విధులు నిర్వహించిన తమను జాబ్‌కార్డుల్లో పనిదినాలు 10 శాతానికి





తగ్గిన కారణంగా విధుల నుంచి తొలగించినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం వీబీజీ రామ్‌జీ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా తిరిగి పనిచేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు బుధవారం రామన్నపేట ఎంపీడీవో ఏ. రాములు, ఏపీవో వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. గతంలో సుమారు 13 సంవత్సరాల పాటు అందించిన సేవలు, తమకు ఉన్న అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు అధికారులను విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ పథకం అమలులో తమ అనుభవాన్ని వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని కోరారు.

## నాగోల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# ఘనంగా ఫోటోగ్రఫీ డే 187వ వేడుకలు

నాగోల్/వన్ నేషన్: నాగోల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటోగ్రఫీ డే 187వ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్స్ జండా ఆవిష్కరించారు. అనంతరం ఫోటోగ్రఫీ పితా మహుడు కెమెరా సృష్టికర్త లూయిస్ డ్యాగురే జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సహదేవ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, కోశాధికారి కిషన్, ఉస్మాన్, సుధాకర్, రాజేష్, భానుప్రకాశ్, సుభాష్, బాషా తదితర సభ్యులు




పాల్గొన్నారు.

# తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్

రామన్నపేట, ఆగస్టు 19 (వన్ నేషన్): రామన్నపేట మండల కేంద్రం లో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉదయం 11.00.గంటలకు (1) రోజు దీక్ష కార్యక్రమం నిర్వహించి, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెకంటి రాము మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి పోస్టల్ ఇన్సూరెన్స్ చేయాలి 51 జీవోను రద్దు చేయాలి నాలుగో లేబర్ కోర్డులను రద్దు చేయాలి, ఆన్లైన్ లేనికా కార్మికుల పేర్లు వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలి డిమాండ్స్ తో కూడిన వినతి పత్రం మండల అభివృద్ధి అధికారి ఆవుల రాములు కి ఇవ్వడం జరిగినది.డిమాండ్స్... ఒక నెల కనీస వేతనం ప్రతి కార్మికునికి 26000 రూ - లు ఇవ్వాలి. 2 . రెండవ ౹=జ ప్రతి కార్మికునికి వర్తించాలి. 3. జి వో నెంబర్ 51 ని సవరించాలని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో




గ్రామ పంచాయతీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, మండల అధ్యక్షులు గాదె ఎల్లయ్య, బొడ్డు సాలయ్య, దాసు, నాగరాజు, సాయిలు, వీరేశం బచ్చలింగస్వామి, గడ్డం ఎల్లయ్య, నల్ల సుగుణమ్మ, చిత్రకంటి శోభ, భారతమ్మ, కవిత, ప్రమీల, మంగమ్మ, జయమ్మ ,తదితరులు పాల్గొనడం జరిగినది.

# బోడుప్పల్ బోనాలకు ప్రముఖుల ఆహ్వానం

మేడ్చల్ /మేడిపల్లి /ఆగస్టు 19/వన్ నేషన్ : బోడుప్పల్: బోడుప్పల్‌లో ఘనంగా నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా విచ్చే యాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూ రి లక్ష్మణ్ కుమార్ లకు మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ ప్రత్యేకం గా ఆహ్వానాలు అందజేశా రు.

ఈ మేరకు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను అందజే యడం జరిగింది.ఈ కార్యక్ర మంలో





బోడుప్పల్ డివిజన్ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్, చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షులు పోగుల దిలీప్ రెడ్డి, బి-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు సుమన్ భూక్యా, కిరణ్ కుమార్ రెడ్డి, చీరాల నర్సింహా, మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకు లు జక్కు రాములు, ధనగళ్ల యాదగిరి, గుర్రాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులే రైతుల వద్దకు వెళ్లాలి

(1వ పేజీ తరువాయి)

తిరిగి చెల్లించలేకపోతే... రికవరీ చర్యలకే పరిమితం కాకుండా, రైతు ఆదాయం ఎందుకు తగ్గిందో విశ్లేషించాలన్నారు. ఈ జూన్ నాటికి బ్యాంకులు వ్యవసాయ రంగానికి రూ.52,337 కోట్ల రుణాలను అందించడం అభినందనీయమని, కానీ... రుణాలు సకాలంలో అందడం ముఖ్యమని సూచించారు. కాగా 2026-27 ఆర్థిక సంవత్సరపు మొత్తం రూ.9,72,253 కోట్ల 'వార్షిక రుణ ప్రణాళిక(ఏసీపీ)'లో ఏప్రిల్ నుంచి జూన్‌వరకు వ్యవసాయంతో పాటు ఇతర రంగాలన్నింటికీ కలిపి రూ.4,05,244 కోట్ల(41.68శాతం) రుణాలను అందజేసినట్లు బ్యాంకులు వివరించాయి. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.1,81,035 కోట్ల లక్ష్యం కాగా... జూన్ నాటికి రూ.52,337 కోట్ల(28.91శాతం) రుణాలను పంపిణీ చేశామని తెలిపాయి. ఒక్క ఖరీఫ్ సీజన్‌లోనే రూ.58,152 కోట్ల లక్ష్యానికిగాను రూ.20,069 కోట్ల(34.51శాతం) వ్యవసాయ రుణాలను పంపిణీ చేశాయి.

Printed, Published and Owned by K.YOUVARAJ Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: K.YOUVARAJ, RNI No. APTEL/2010/33523, E-mail: onenation014@gmail.com.